సాక్షి
నిజామాబాద్
ఆదివారం ౹ 25 ౹ మే ౹ 2025



సాగు ఖర్చు తగ్గించుకోవాలి

రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి పేర్కొన్నారు.

- 8లో ▸



విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త

వర్షాల నేపథ్యంలో వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఈ రవీందర్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /23.5

ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కక్షిదారులు ముందుకు రావాలి

• సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



ఆర్మూర్‌టౌన్: కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న తమ కేసుల పరిష్కారానికి ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కోర్టులో పెండింగ్ ఉన్న చిన్న చిన్న కేసులను మధ్యవర్తుల అవసరం లేకుండా ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. న్యాయ చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడంలో విశ్రాంత ఉద్యోగులు ప్రధానపాత్ర పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాంరెడ్డి, అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 2,789 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 , మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1061.5(11.96 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వానివి ఉట్టి మాటలే..

• మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా అవన్నీ ఉట్టి మాటలేనని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా, బాల్కొండ నియోజకవర్గంలో ఇంకా కల్లాల వద్ద, రహదారులపై ధాన్యపు రాశులు కుప్పలుగా పడి ఉన్నాయన్నారు. కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసి మొలకలు వచ్చిందని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే ధాన్యం నీటిపాలు అవుతోందన్నారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని తీసుకోడానికి అధికారులు ముందుకు రావడం లేదని రైతులు గోడు వెల్లబోసుకుంటున్నారని, గతంలో తడిసిన ధాన్యాన్ని కేసీఆర్ కొన్న సంగతి గుర్తు చేశారు. రైస్‌మిల్లుల్లో తరుగు తీస్తూ రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డిమాండ్ చేశారు. అకాల వర్షానికి నష్టపోయిన సజ్జ, ఇతర పంటల రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఆర్మూర్ పట్టణం కొటార్మూర్‌లోని శివ పంచాయతన సహిత హనుమాన్ మందిరంలో భజన చేస్తున్న భక్తులు



భగవంతుని అనంత నామాలు, రూపగుణ మహిమాదులను రాగ తాళయుక్తంగా తన్మయత్వంతో సమష్టిగా కీర్తించడమే భజన. భగవంతుని పూజిస్తూ మహిమలను భజనల ద్వారా కీర్తిస్తూ మనోగత ఆవేదనలను విన్నవించుకుంటూ ముక్తులవుతున్నారు పలువురు భక్తులు. దశాబ్దాలుగా భగవన్నామ స్మరణ చేస్తున్న భజన బృందాలపై ప్రత్యేక కథనం..



25 ఏళ్లుగా భజనలు

ఆర్మూర్ పట్టణంలోని కొటార్మూర్‌లో శివ పంచాయతన సహిత హనుమాన్ మందిరంలో భజన మండలి సభ్యులు ప్రతి శనివారంతోపాటు ఉగాది, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, వినాయక చవిత, దసరా లాంటి పర్వదినాల్లో భజనలు నిర్వహిస్తారు. సుమారు 25 సంవత్సరాలుగా భగవంతుడిని స్తుతిస్తూ ఈ భజన మండలి సభ్యులు తమకంటూ ప్రత్యేకతను సాధించుకున్నారు. దేర మోహన్, ప్రవీణ్, తొగర్ల రాజు, లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, లింబాద్రి తదితర భక్తులు భజన మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు.

సండే స్పెషల్

భగవన్నామ స్మరణలో..

దశాబ్దాలుగా భజనలతో దైవచింతన

- ప్రత్యేక రోజులు, పండుగలు, వేడుకల్లో భగవంతుడిని స్తుతిస్తున్న భక్తులు
- ఆర్మూర్‌లో దేవుని మహిమలను కీర్తిస్తున్న భజన మండలిలు
- ఏటా టీటీడీ నుంచి భజన భక్తులకు ఆహ్వానం



ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై భజన చేస్తున్న పిప్రి గైని భజన మండలి సభ్యులు

ఆర్మూర్: సనాతన సంప్రదాయంలో భక్తులు దేవుడిని స్మరించుకోవడానికి భజనలు వేదికగా మారాయి. ఆలయాల్లో గుంపుగా చేరి సాగించు స్మరణను భజనగా వ్యవహరిస్తారు. కష్టంలో ఉన్న భక్తులు భగవంతుడిని స్తుతిస్తూ స్తోత్రం చేస్తారు. కొందరు వ్యక్తిగతంగా భజన చేస్తే మరికొందరు సమష్టిగా చేస్తారు. మన దేశంలో భజనలు చేసే సంప్రదాయం పురాతనమైనది. మీరా బాయి, సూరదాస్, కబీర్, తులసీదాస్ వంటి వారు తొలి భజన స్వరకర్తలలో ఉన్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన భజన ఇతివృత్తాలలో రామాయణంతోపాటు ఇతర హిందూ గ్రంథాల నుంచి శ్లోకాలు, దేవుళ్లు, దేవతల స్తుతులు, వాటి మహిమలు ఉన్నాయి.

భజనలు రెండు రకాలు. చక్రి భజన, సోంగి భజన. తుక్డోజీ మహరాజ్ ఖంజీరి భజన్ అని పిలువబడే భజన యొక్క కొత్త రూపాన్ని పరిచయం చేశాడు. భజ నలు, హారతులు, వాటి ఉత్తేజకరమైన రాగాలు మంచి సాహిత్యంతో భక్తులకు ఉత్సాహాన్ని పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. సామూహికంగా భగవన్నామావళిని లయబద్ధంగా గొంతు కలిపినపుడు మనసు అలౌకిక ఆనందంలో తేలియాడుతుంది.

భజన నియమాలివే..

ఒక సాధారణ భజనలో పాటలను ఒక వ్యక్తి లేదా ప్రధాన గాయకుల బృందం నడిపిస్తారు. ప్రధాన గాయకులు ఒక్కొక్క పంక్తిని పాడుతుంటే మిగిలిన వారు వెనుక పాట పాడుతారు. పాటకు తగ్గట్టు తాళం వేస్తూ, హార్మోనియం పలికిస్తూ మృదంగం వాయిస్తారు. కీర్తనలోని ప్రతి పంక్తిని మొదటి వేగంలో రెండుసార్లు పాడతారు. రెండో వేగంలో ఒకసారి పాడతారు, దీంతో భజన పరిపూర్ణవుతుంది.

భజనకు ఉపయోగించే వాయిద్యాలు..

స్థానికంగా భక్తులు భజనకు హార్మోనియం, తబలా, డోలక్, మృదంగం, వీణ, సితార, బాన్సురీ, షెహనాయి, తాళాలను వాయిద్యాలుగా ఉపయోగిస్తారు. భజనలో తాళాలు.. ప్రత్యేక వాయిద్య విశేషమని చెప్పుకోవచ్చు. దీనిని ప్రాంతాల వారీగా మంజీర, జల్రా లేదా గిని అని పిలుస్తారు. రెండు కంచు బిళ్లలతో కూడిన సాధనం. ఈ రెండు కంచు బిళ్లలను ఒకదానిపై ఒక దానిని తాకించి శబ్దం చేస్తారు.

మూడు దశాబ్దాల భజన మండలి..

ఆర్మూర్ పట్టణంలోని పిప్రి గైనిలో ఉన్న హనుమాన్ మందిర కేంద్రంగా పిప్రి గైని భజన మండలి ప్రారంభమైంది. 30 మంది సభ్యులు ఉన్న ఈ భజన మండలి సభ్యులు లాభాపేక్ష లేకుండా భజనలను కొనసాగిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రమైన నవనాథ సిద్దుల గుట్టపై 30 సంవత్సరాలుగా ప్రతి సోమవారం, పర్వదినాల్లో భజనలు చేస్తూ భక్తుల మన్ననలను పొందుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఈ భజన మండలి సభ్యులకు ఏటా పిలుపు వస్తుంది. అల్లకొండ ఒడ్డెన్న, కాసుల పోశెట్టి, కోళ్ల భాజన్న, లింబాద్రి, గంగారాం తదితరులు భజన మండలి సభ్యులుగా ఉన్నారు.

పాండిత్యం లేకున్నా భజనతో స్మరణ..



వేదాలు, పురాణాలు చదవకున్నా పాండిత్యం లేకున్నా భగవంతుడిని పూజించడానికి ఉన్న ఏకైక మార్గం భజన.. భజనలో భగవన్నామ స్మరణ చేయడం ద్వారా దేవుడి కృపకు పాత్రులమవుతున్నాము. - లింబాద్రి, పిప్రి గైని భజన మండలి సభ్యుడు, ఆర్మూర్

నిస్వార్థంగా భగవన్నామ స్మరణ...



30 సంవత్సరాలుగా నిస్వార్థంగా భజన చేస్తూ భగవంతుని సేవలో ఉన్న మా జన్మ ధన్యమైంది. పిప్రి గైని భజన మండలికి ఆర్మూర్ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. - అల్లకొండ ఒడ్డెన్న, పిప్రి గైని భజన మండలి సభ్యుడు, ఆర్మూర్

వినాయకుడి స్తోత్రంతో ప్రారంభిస్తాం



ఏ ఆలయంలో భజన నిర్వహించినా.. పర్వదినం ఏదైనా.. వినాయకుని స్తోత్రంతో భజనను ప్రారంభిస్తాం. అనంతరం భక్తుడికి వచ్చిన పాటతో భగవంతుని లీలలను గానం చేస్తుంటే కోరస్ ఇస్తూ భజనను రంజింప జేస్తాం. - దేర మోహన్, భజన మండలి సభ్యుడు, కొటార్మూర్–పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

తప్పక హాజరవుతారు..



కొటార్మూర్ హనుమాన్ మందిరంలో ప్రతి శనివారం నిర్వహించే భజన కార్యక్రమానికి భక్తులు వయసుతో సంబంధం లేకుండా హాజరువుతారు. భగవన్నామ స్మరణలో లీనమవుతారు. - శ్రీనివాస్, భజన మండలి సభ్యుడు, కొటార్మూర్–పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

రైతులకు అండగా పీఏసీఎస్‌లు



మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాసరావు, పాల్గొన్న రైతులు

• జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసరావు

నిజామాబాద్ రూరల్ : రైతులకు ప్రయోజనం చేకూర్చడంలో సహకార సంఘాల పాత్ర పారదర్శకంగా ఉండాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మాధవనగర్ సహకార సంఘ పరిధిలోని రైతులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీవో మాట్లాడుతూ అన్నదాతలకు అండగా సహకార పరపతి సంఘాలు నిలబడుతున్నాయని అన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి దళారుల నుంచి రైతులను కాపాడుతున్నామని తెలిపారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి రైతులకు సరైన సమయంలో అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాధవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు పోశన్న, సరస్వతి, సహకార సంఘ సీఈవో వంశీకృష్ణ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో జిల్లా విద్యార్థికి 9వ ర్యాంక్

- ఎంపీసీలో 78.83 శాతం, ఎంబైపీసీలో 77.14శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయి ర్యాంకులతో ప్రతిభ



చౌదరాపు శ్రీనిక, స్టేట్ 9వ ర్యాంకు, సీతారాంనగర్ కాలనీ.



ప్రణీత, (ఎంపీసీ) జిల్లా 2వ ర్యాంకు శివాజీనగర్



ప్రణీత్, (ఎంపీసీ/ఎంబైపీసీ) జిల్లా 3వ ర్యాంకు, బాడ్సి(మోపాల్)



శ్రీనిత,(ఎంబైపీసీ) జిల్లా 1వ ర్యాంకు, నర్సింగ్‌పల్లి (మోపాల్)



దీప్తి, (ఎంబైపీసీ) జిల్లా 2వ ర్యాంకు, కందకుర్తి (రెంజల్)

నిజామాబాద్ అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలల్లోని వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ పాలిసెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన చౌదారపు శ్రీనిక ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయి 9వ ర్యాంకుతో ప్రతిభ చాటింది. పాలిసెట్‌కు జిల్లా వ్యాప్తంగా 6,111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఎంపీసీ విభాగంలో 78.83 శాతం, ఎంబైపీసీలో 77.14 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను పాలిసెట్ నిర్వాహకులు ప్రకటించారు. ఎంపీసీ విభాగంలో శ్రీనిక రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు, జిల్లా స్థాయి 1వ ర్యాంకు సాధించింది. ప్రణీత రాష్ట్ర స్థాయిలో 105వ ర్యాంకు, జిల్లా స్థాయి 2వ ర్యాంకు, ప్రణీత్ రాష్ట్ర స్థాయిలో 141 ర్యాంకు, జిల్లా స్థాయి మూడో ర్యాంకు సాధించారు. ఎంబైపీసీలో ఈదులాయి శ్రీనిత రాష్ట్ర స్థాయి ఐదో ర్యాంకు, జిల్లా స్థాయి 1వ ర్యాంకు, నందగిరి దీప్తి రాష్ట్రస్థాయి 74వ ర్యాంకు, జిల్లా స్థాయి 2వ ర్యాంకు, షేరు ప్రణీత్ రాష్ట్రస్థాయి 91వ ర్యాంకు, జిల్లా స్థాయి 3వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

సైంటిస్టు అవుతాను

భవిష్యత్తులో మంచి సైంటిస్టు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకు అనుగుణంగానే ప్రణాళికాబద్ధంగా చదువుతాను. పాలిసెట్‌లో ఉత్తమ మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. - చౌదారపు శ్రీనిక

మూడు నెలల రేషన్ ఒకేసారి..

- వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- 26,217 మెట్రిక్ టన్నులు అవసరం
- దుకాణాలకు చేరుతున్న సన్నబియ్యం
- దిగుమతికి డీలర్ల తంటాలు

రేషన్ దుకాణాల సంఖ్య	రేషన్‌కార్డులు	కార్డుల్లో సభ్యుల సంఖ్య
759	4,02,154	13,10,012



దుబ్బ రోడ్‌లో రేషన్ దుకాణానికి వచ్చిన సన్నబియ్యాన్ని అన్‌లోడింగ్ చేస్తున్న కూలీలు

సుభాష్‌నగర్ : వచ్చే నెలలో ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నారు. వానాకాలంలో కురిసే భారీ వర్షాలు, వరదలు, నిల్వ తదితర ఇబ్బందుల దృష్ట్యా రేషన్ బియ్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడు నెలల కోటా ఒకేసారి అందజేయాలని కేంద్రం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో పౌర సరఫరాలశాఖ అధికారులు రేషన్ బియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 26, 217 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమని భావిస్తున్నారు.

జూన్ 1 నుంచి 30వరకు పంపిణీ..

జిల్లాలోని 759 రేషన్ దుకాణాల ద్వారా 4,02,154 కార్డుదారులకు జూన్ 1 నుంచి 30 వరకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ చేసేవారు. కానీ, కేంద్రం ఆదేశాల మేరకు రాష్ట్రంలో జూన్ నెల మొత్తం పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులు జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ కోటా బియ్యం తీసుకెళ్లాల్సి ఉండగా, అందుకు ఒక్కొక్కరు మూడుసార్లు బయోమెట్రిక్ పెట్టాల్సి ఉంటుంది. ఒక కార్డుదారుడు వరుసగా రెండు, మూడుసార్లు వేలిముద్రలు స్వీకరించే అవకాశం పీవోఎస్‌లో లేదు. ఈ లెక్కన కార్డుదారులు రేషన్‌దుకాణాల్లో గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి వస్తుంది. ఈ విషయమై కేంద్రం పీవోఎస్ (బయోమెట్రిక్ మిషన్)లో ఏమైనా మార్పులు చేస్తుందేమో వేచిచూడాలి.

స్థలం లేక ఇబ్బంది..

మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ చేసేందుకు జిల్లాకు 26,217 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని 8 ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా ఇప్పటికే రేషన్ దుకాణాలకు బియ్యం రవాణా చేపడుతున్నారు. కాగా, మూడు నెలల రేషన్ కోటా బియ్యం ఒకేసారి దిగుమతి చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు.

సకాలంలో పంపిణీ చేయాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

వచ్చే మూడు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. చౌకధరల దుకాణ డీలర్లు మూడు మాసాల కోటాను దిగుమతి చేసుకొని వినియోగదారులకు సకాలంలో బియ్యం కోటా పంపిణీ చేయాలని సూచించారు. జూన్ 30 లోపు పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా, కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ చేపట్టేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని పౌర సరఫరాలశాఖ అధికారులను ఆదేశించారు.

అలసత్వం వద్దు..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం పంపిస్తున్నాం. జూన్ 1 నుంచి 30 వరకు డీలర్లు బియ్యం పంపిణీ చేయాలి. తర్వాత నెలలో పంపిణీకి అవకాశం ఉండదు. కార్డుదారులు మూడు నెలల కోటా ఒకేసారి తీసుకెళ్లాలి. డీలర్లు పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు. - అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

నేడే గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పాల్గొన్న అధికారులు

- జిల్లాలో 331 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేశాం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: గ్రామ పాలన అధికారుల రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కొనసాగనున్న రాత పరీక్షకు జిల్లాలో 331 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జీపీవో రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల విషయమై శనివారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణకు జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కమిషనర్‌కు వివరించారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో గదిలో 32 మంది అభ్యర్థుల చొప్పున మొత్తం 11 గదులలో పరీక్ష నిర్వహించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, తగిన పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఇన్విజిలేటర్‌లతోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని తెలిపారు. అనంతరం కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోటుపాట్లకు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో రాత పరీక్ష నిర్వహించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సహకరించే స్క్రైబ్‌లు పదో తరగతి లోపు విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, జీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తహసీల్దార్ బాలరాజు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఔషధాల స్వాధీనం



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో అనుమతి లేకుండా, వైద్య నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లీనిక్‌లను మూడు రోజుల క్రితం జిల్లా వైద్యాధికారి రాజశ్రీ సీజ్‌ చేశారు. కాగ శనివారం సీజ్‌ చేసిన భారతీ, జూహి, ప్రియాంక, ఝాన్సీ లింగాపూర్‌ క్లీనిక్‌లకు డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీలత నోటీసులు జారీ చేశారు. అలాగే క్లీనిక్‌ల నుంచి ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. సీజ్‌ చేసిన ఔషధాలను కోర్టుకు సమర్పించి, పంచనామ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అధికారులు కృష్ణమూర్తి, రమేష్‌, గిరిబాబు, సాయి, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

కవిత లేఖకు జవాబు ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్‌: కాంగ్రెస్‌ పార్టీపై విమర్శలు మాని, కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖకు కేటీఆర్‌ సమాధానలు ఇవ్వాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ సవాలు విసిరారు. పట్టణంలోని సీ కన్వెషన్‌ హాల్‌లో కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్‌ కుటుంబం దోచుకున్న సొత్తును పంచుకోవడంలో తగాదాలు రావడంతోనే ఎమ్మెల్సీ కవిత తండ్రికి లేఖ రాయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అవినీతికి నిలయమైన బీఆర్‌ఎస్‌ పార్టీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఎస్టీ కార్పొరేషన్‌ చైర్మన్‌ తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌ రెడ్డి, సాయిబాబాగౌడ్‌, మార చంద్రమోహన్‌, చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యాదాద్రి జిల్లా ఆరోగ్య శాఖ ఏడీగా చేపూర్‌ వాసి

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం చేపూర్‌ గ్రామానికి చెందిన మండల మోహన్‌దాస్‌ యాదాద్రి భువనగిరి జిల్లా ఆరోగ్య శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. మోహన్‌దాస్‌ ప్రస్తుతం నాగర్‌ కర్నూల్‌ జిల్లా ఆరోగ్య శాఖలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మోహన్‌దాస్‌ ఏడీగా పదోన్నతి పొందడంపై దళిత ఐక్య సంఘటన ఆర్మూర్‌ డివిజన్‌ నాయకులు జంగం అశోక్‌ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్‌ ప్రమాదాలతో జాగ్రత్త

- సమస్యలుంటే అధికారులకు సమాచారమివ్వాలి
- ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్‌



ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్‌

మోపాల్‌: రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో విద్యుత్‌ వినియోగదారులు, రైతులు విద్యుత్‌ ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్‌ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్‌ ఒక ప్రకటనలో సూచించారు. విద్యుత్‌ సమస్యలు ఏమైనా తలెత్తితే స్వయంగా ఎలాంటి పనులు చేపట్టవద్దని తెలిపారు. ముఖ్యంగా తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌ తీగలను తాకవద్దని, ప్రమాదకరంగా ఉన్నట్లు గమనించిన వెంటనే సంబంధిత అధికారులను గాని, టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1912కు గాని సంప్రదించాలని తెలిపారు. అలాగే విద్యుత్‌ వినియోగదారులు, రైతులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు.

- ఇళ్లల్లో బట్టలు ఆరవేసేందుకు జీఐ వైర్‌ను ఉపయోగించడం వల్ల విద్యుత్‌ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- ఇంటి ఎదుట రేకులకు కూడా విద్యుత్‌ సరఫరా అయ్యే ప్రమాదముందని, స్తంభాల నుంచి విద్యుత్‌ సరఫరా అయ్యే తీగలను ఎట్టి పరిస్థితుల్లో దండాలు, రేకులకు తగలకుండ జాగ్రత్త వహించాలి.



- పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లవద్దని, విద్యుత్‌ తీగలు కింద పడి ఉంటే కాపరులు వాటిని గమనించి పశువులు అటు వైపు వెళ్లకుండా అప్రమత్తం కావాలి.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్‌ చేయించాలి. నాసిరకం విద్యుత్‌ పరికరాలు, పంపుసెట్లు వాడొద్దన్నారు. కరెంట్‌ మోటార్లు, ఫుట్‌ వాల్వులు, సర్వీస్‌ వైర్లకు ఇన్సులేషన్‌ విద్యుత్‌ ప్రసారం జరుగుతాయని తెలిపారు. రైతులు ఏమరుపాటుతో మోటార్లు, పైపులు, ఫుట్‌ వాల్వులు తాకొద్దని, ఎర్తింగ్‌ సులభంగా చేసుకోవచ్చన్నారు.
- విద్యుత్‌ సమస్యలు తలెత్తితే అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్లతో పనులు చేయించుకోవాలని అన్నారు.
- విద్యుత్‌ కంచెల వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఎవరైనా అలాంటి కంచెలు ఏర్పాటు చేస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యుత్‌ కంచెలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.
- వానాకాలం సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అధికారికంగా ఫ్యూజులు మార్చడం, రిపేర్‌ చేయడం, ఏబీ స్విచ్చులు ఆపరేట్‌ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమన్నారు. వ్యవసాయ మోటార్లు, గృహాల్లో నాణ్యమైన, జాయింట్లు లేని సర్వీస్‌ వైరు ఉపయోగించాలన్నారు.
- ప్రమాదవశాత్తు ఎవరికైనా విద్యుత్‌ షాక్‌ సంభవిస్తే, ఇతరులు అతడిని ముట్టుకోవద్దన్నారు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్‌ ప్రవహించని కర్ర, ప్లాస్టిక్‌ వంటి వస్తువులను వాడాలని సూచించారు.
- గ్రామీణ వినియోగదారులు, రైతులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్‌ సిబ్బంది లైన్‌మెన్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సబ్‌ ఇంజనీర్‌, సెక్షన్‌ ఆఫీసర్‌ను సంప్రదించి వారి సేవలను పొందాలి.

త్వరలో అందుబాటులోకి సీఎంసీ వైద్య సేవలు

డిచ్‌పల్లి: త్వరలోనే క్రిస్టియన్‌ మెడికల్‌ కాలేజ్‌ (సీఎంసీ) ఆస్పత్రి వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని సీఎంసీ డైరెక్టర్‌, ఐఎంఏ నిజామాబాద్‌ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్‌ అన్నారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో శనివారం డిచ్‌పల్లి క్రిస్టియన్‌ మెడికల్‌ కాలేజ్‌ (సీఎంసీ) ఆధ్వర్యంలో ఐఎంఏ నిజామాబాద్‌ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సీఎంసీ చైర్మన్‌ షణ్ముగమ్‌ మహాలింగం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం అజ్జ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. వైద్యులు పాండు, విశాల్‌, మోతీలాల్‌, ప్రతిభ, శిల్ప, వికాస్‌, సుప్రజ, హనిశ్‌, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.



మెంట్రాజ్‌పల్లిలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ: ఖరీఫ్‌ సీజన్‌లో పంటలు సాగు చేయుటకు రైతులు సిద్ధమవుతున్నారు. మరో మూడు రోజులు గడిస్తే రోహిణి కార్తె ప్రారంభమవుతుంది. ఈక్రమంలో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేస్తే అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ వ్యవసాయ అధికారిణి బద్దం లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొనుగోళ్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు తప్పకుండా తీసుకోవాలి. బిల్లు రసీదు పై డీలరు, రైతు సంతకం తప్పకుండా ఉండాలి.
- రసీదు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి.
- స్థానిక పరిస్థితులను బట్టి అనుకూలమైన, మంచి దిగుబడి వచ్చే నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి.
- గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలను విక్రయించే వారి వద్ద నుంచి అసలు కొనుగోలు చేయవద్దు. ఎవరైనా లైసెన్స్‌ లేకుండా విత్తనాలను విక్రయిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమచారం అందించాలి.
- విత్తనాలు విక్రయిస్తామంటూ ముందస్తుగా డబ్బులు వసూలు చేసే వ్యాపారుల వద్ద డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. అలాంటి వ్యాపారులు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమచారమందించాలన్నారు.
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే ఆధీకృత డీలర్ల నుంచి కొనుగోలు చేసి రసీదు పొందాలన్నారు.

రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలి

నిజామాబాద్‌ రూరల్‌: రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి అన్నారు. మండలంలోని గుండారం గ్రామంలో శనివారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్‌ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంతో వ్యవసాయ అధికారి వీరస్వామి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఏవో హీరా జాదవ్‌ మాట్లాడుతూ.. రైతులు విత్తన కొనుగోలులో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. నూతన వంగడాలకు సంబంధించి, రైతులు ఖరీఫ్‌ సీజన్‌లో తీసుకునే జాగ్రత్తల గురించి అవగాహన కల్పించే వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారులు అంజయ్య, అమల, స్వాతిలత, వసంత, రాకేష్‌, రైతులు శంకర్‌రెడ్డి, సాయారెడ్డి, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి వీరస్వామి

గురుకులంలో కౌన్సెలింగ్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌):మండలంలోని కంజర్‌ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లాల 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు శనివారం ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, ర్యాంకు పొందిన విద్యార్థులకు మెరిట్‌ ఆధారంగా కౌన్సెలింగ్‌ నిర్వహించినట్లు ఆర్‌సీవో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 21 గురుకుల పాఠశాలలు ఉన్నాయని, 724 సీట్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించామన్నారు. మిగిలిన సీట్లకు మరోసారి కౌన్సెలింగ్‌ నిర్వహించి భర్తీ చేస్తామన్నారు.

జిల్లాలో 24.5 మి.మీ వర్షం

నిజామాబాద్‌ అర్బన్‌ : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా 24.5 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా, 21 మండలాల్లో అత్యధికంగా, 12 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. నవీపేట మండలంలో 48.3మి.మీ., రెంజల్‌ 29.3, ఆలూరు 20.7, నిజామాబాద్‌ సౌత్‌ 22.0, రుద్రూర్‌ 25.8, బాల్కొండ 11.3, ఎడపల్లి 14.3, నిజామాబాద్‌ నార్త్‌లో 19.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా పీసీసీ చీఫ్‌ జన్మదిన వేడుకలు

నిజామాబాద్‌ సిటీ: జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శనివారం పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేష్‌కుమార్‌ గౌడ్‌ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌, నుడా చైర్మన్‌ కేశ వేణు ఆధ్వర్యంలో కేక్‌ కట్‌చేసి, పంచిపెట్టారు. అనంతరం సంబురాలు నిర్వహించారు. తాహెర్‌బిన్‌ హందాన్‌ మాట్లాడుతూ.. మహేష్‌ కుమార్‌ గౌడ్‌కు పుట్టినరోజు కానుకగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ జెండా ఎగురవేసి బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం కేశ వేణు మాట్లాడుతూ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగారన్నారు. పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, నాయకులు రత్నాకర్‌, జావిద్‌ అక్రమ్‌, రాంభూపాల్‌, దయాకర్‌ గౌడ్‌, బొబ్బిలి రామకృష్ణ, సంతోష్‌, నరేందర్‌ గౌడ్‌, మఠం రేవతి, సుజాత, పోల ఉష, విజయలక్ష్మి, విజయ, అపర్ణ, అవిన్‌, కొండపాక రాజేష్‌, సిరికొండ గంగారెడ్డి, పవన్‌కుమార్‌, కోనేరు సాయికుమార్‌ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ భవన్‌లో కేక్‌ తినిపించుకుంటున్న నేతలు

జీపీవో పరీక్ష కేంద్రం వద్ద సెక్షన్‌ 163 అమలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ కాలేజీలో నేడు జీపీవో (గ్రామ పాలన అధికారి) పరీక్ష నిర్వహించనుండటంతో పరీక్ష కేంద్రం వద్ద సెక్షన్‌ 163 అమలు చేయనున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా సెక్షన్‌ 163 అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదన్నారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరుగవద్దని, పరిసర ప్రాంతాలలోని జిరాక్స్‌ సెంటర్లను మూసివేసి ఉంచాలని తెలిపారు.

27న అథ్లెటిక్స్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నాగారంలోని రాజారాం స్టేడియంలో ఈనెల 27న జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కిడ్స్‌ సబ్‌ జూనియర్‌ చాంపియన్‌షిప్‌ అండర్‌ 8, 10 ,12 సంవత్సరాల బాలబాలికలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్‌, రాజాగౌడ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అథ్లెట్స్‌కు జూన్‌ 1న సికింద్రాబాద్‌ జింఖానా స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. 60మీటర్లు, 200 మీటర్లు, 400మీటర్లు, 600మీటర్లలో పరుగు, స్టాండింగ్‌ బ్రాడ్‌ జంప్‌, లాంగ్‌ జంప్‌, టెన్నిస్‌ బాల్‌ త్రో, కిడ్స్‌ జావిలిన్‌ త్రో ఈవెంట్స్‌ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 26 లోపు 9989040776 సంప్రదించి రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు.

తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేసిన కొడుకు

- అయ్యపల్లి తండాలో దారుణం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండాలో కన్న కొడుకు తండ్రిని గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన దేవసోత్‌ ఫకీరానాయక్‌ (48)కు భార్య ఫంగి, కొడుకు ప్రకాష్‌, కూతురు ఉన్నారు. ఈనెల 16న వారు నూతన గృహ ప్రవేశం చేశారు. ఫకీరానాయక్‌ చెడు వ్యసనాలకు బానిసై మరో పెళ్లి చేసుకోడానికి ప్రయత్నించగా భార్య, కొడుకు అడ్డు తగులుతున్నారు. దీంతో శనివారం రాత్రి ఇల్లును తగలబెడతానని ఫకీరా గ్యాస్‌ సిలిండర్‌ ఓపెన్‌ చేశాడు. ఇల్లు తగలబడిపోతుందని వారించినా పట్టించుకోకపోవడంతో కోపోద్రిక్తుడై కొడుకు ప్రకాష్‌ పక్కనే ఉన్న గొడ్డలిని తీసుకొని తండ్రి ఫకీరానాయక్‌ మెడపై నరికాడు. దాంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు తండాకు చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై ప్రకాష్‌నాయక్‌ తెలిపారు.

పెచ్చులూడిన 'డబుల్‌' ఇంటి పైకప్పు: చిన్నారికి గాయాలు

బాల్కొండ: మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లలో స్లాబ్‌ పెచ్చులూడుతున్నాయి. శనివారం డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కాలనీలోని మోహన్‌కు చెందిన ఇంటి పైకప్పు పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మోహన్‌ కూతురు ప్రీతికకు స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో ఇళ్ల నాణ్యతపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఇళ్ల నాణ్యతను తనిఖీ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

క్రైం కార్నర్‌

విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్‌



బిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. టిప్పర్‌ వాహనం విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగి, వైర్లు రోడ్డుపై పడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వివరాలు ఇలా.. ఓ టిప్పర్‌ లక్ష్మీదేవునిపల్లి నుంచి అంతంపల్లి గ్రామం ద్వారా హైవే పైకి బయలుదేరింది. టిప్పర్‌ డ్రైవర్‌ మద్యం మత్తులో వాహనం నడపడంతో గ్రామంలోని విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. పెద్ద ఎత్తున మిరుగులు రావడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే గ్రామస్తులు విద్యుత్‌ అధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి విద్యుత్‌ సరఫరా నిలిపివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

ట్రాక్టర్‌ పట్టివేత



సిరికొండ: సిరికొండ రేంజ్‌ పరిధిలోని అటవీ భూమిలో అక్రమంగా పొదలను తొలగిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో రవీందర్‌ శనివారం తెలిపారు. జినిగ్యాల తండాకు చెందిన సవాయిలాల్‌ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా అటవీ భూమిలో పొదలు తొలగిస్తున్నందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్‌ ప్రోగ్రాం'



రుద్రూర్‌: నేరాల నియంత్రణ కోసమే పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌ అన్నారు. రుద్రూర్‌ మండల కేంద్రంలోని జవహర్‌ నగర్‌ కాలనీలో శనివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్‌ (కార్డెన్‌ సెర్చ్‌) నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు చూపని వాహనాలను సీజ్‌ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. స్థానికంగా అనుమానితులు, అపరిచితులు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సీజ్‌ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకువస్తే వాహనాన్ని విడుదల చేస్తామన్నారు. బోధన్‌, రుద్రూర్‌ సీఐలు కృష్ణ, వెంకట నారాయణ, ఎస్సైలు సాయన్న, మహేష్‌, సునీల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులు ఉంటే సమాచారం ఇవ్వండి

ఖలీల్‌వాడి: స్థానికంగా అనుమానితులు, అపరిచితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని ఒకటో టౌన్‌ పోలీసులు తెలిపారు. నగరంలోని హబీబ్‌నగర్‌, కొజ్జాకాలనీ, మాలపల్లిలో శనివారం వారు ఆపరేషన్‌ ఛబుత్రా నిర్వహించారు. కాలనీలో అనుమానితులను తనిఖీలు చేయడంతోపాటు, నెంబర్‌ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాలనీలోకి కొత్తగా వచ్చిన వారు, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రాత్రివేళ్లలో వాహనాలపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఖానాపూర్‌లో ఒకరి ఆత్మహత్య



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం ఖానాపూర్‌ గ్రామంలో వడ్డెపు లక్ష్మీనర్సయ్య (40)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ శనివారం తెలిపారు. లక్ష్మీనర్సయ్య భార్య రెండేళ్ల క్రితం ఇంట్లో గొడవపడి కూతురు, కొడుకుతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాంపల్లి తండాలో వివాహిత..

డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి తండా గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు డిచ్‌పల్లి ఇన్‌చార్జి ఎస్సై జాదవ్‌ సుహాసిని తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన రాథోడ్‌ సకుణ (50) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం సుద్దపల్లి చెరువులో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరించారు. సకుణ కుటుంబీకులు మృతదేహాన్ని సకుణగా గుర్తించారు. భర్త సుదాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే సకుణ ఆత్మహత్య చేసుకోవడంతో సాంపల్లి తండాలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి, అంత్యక్రియలు నిర్వహించారు.

కుక్కల దాడిలో గాయపడిన మహిళ మృతి



రేణమ్మ(ఫైల్‌)

దోమకొండ: కుక్కల దాడిలో గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన చింపల్ల రేణమ్మ(38) పదిహేను రోజుల క్రితం ఉదయం ఇంటిముందు వాకిలి శుభ్రం చేస్తుండగా వీధి కుక్కలు కరిచాయి. దీంతో ఆమె స్పృహతప్పి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త రాజు, ఇద్దరు కూతుళ్లు దేవిక, దివ్య, కుమారుడు సందీప్‌ ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..



దాస పద్మ(ఫైల్‌)

బాల్కొండ: కరెంట్‌ షాక్‌తో గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన దాస పద్మ(50) ఈ నెల 18న తన ఇంట్లో బోర్‌ మోటర్‌ స్విచ్‌ ఆన్‌ చేస్తుండగా కరెంట్‌ షాక్‌ తగిలింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు శనివారం ఉదయం మృతి చెందింది. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల తండాకు చెందిన బానోత్‌ అర్చనా అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై వెంకట్రావు శనివారం తెలిపారు. ఈనెల 22న ఇంట్లో ఎవరు లేని సమయంలో అర్చనా బయటకు వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరంలో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన దడిగెల రాజేశ్వర్‌(35) అప్పుల వారు వేధించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్సై శ్రీకాంత్‌ శనివారం తెలిపారు. రాజేశ్వర్‌కు గతంలో అప్పులు, లోన్లు ఇచ్చిన వారు తరచు ఇంటికి రావడంతో అతడు మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



రుద్రూర్‌: మండలంలోని అంబం (ఆర్‌) గ్రామంలో పాపవ్వ అనే మహిళకు చెందిన ఇల్లు వర్షాలకు కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో పాపవ్వ ఇంట్లో లేనందున ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఉండడానికి ఇల్లు లేక అవస్థలు పడుతుంది. ఆమెకు ఉన్న ఒక్క కొడుకు గతంలోనే మృతి చెందడంతో ఒంటరిగా ఉంటోంది. ఈ సమయంలో ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరుతుంది.

బంగారు నగల కోసమే మహిళ హత్య

గాంధారి(ఎల్లారెడ్డి): ఓ దివ్యాంగ మహిళతో ఓ యువకుడు కొన్నేళ్లుగా సన్నిహితంగా ఉంటూ ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగల కోసం హత్య చేయగా, నిందితుడిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని గుర్జాల్‌ గ్రామానికి చెందిన దివ్యాంగ మహిళ బ్యాగరి మణెవ్వ(37)కు ఇదే మండలం రాంలక్ష్మణ్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు కొండని రవీందర్‌ అలియాస్‌ ఈసంతపురం రవీందర్‌ రెండేళ్ల క్రితం పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. మణెవ్వకు ఒక కూతురు ఉండగా ఆరు నెలల క్రితం పెళ్లి చేసి పంపించారు. కూతురు పెళ్లిలో మణెవ్వ బంగారు నగలు ధరించగా, ఆ నగలను ఎలాగైనా కాజేయాలని రవీందర్‌ పథకం పన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న మణెవ్వకు అతడు ఫోన్‌ చేసి యాదగిరి గుట్ట సమీపంలో స్వర్ణగిరి గుట్టకు వెళ్దామని, కారులో ఎక్కించుకుని సిద్దిపేట్‌ జిల్లా గజ్వేల్‌ తీసుకెళ్లాడు. కానీ అక్కడ హత్య చేయడం వీలు కాకపోవడంతో అర్ధరాత్రి రామాయంపేట్‌-మెదక్‌ రహదారిలో తొనిగండ్ల శివారుకు తీసుకెళ్లాడు. అనంతరం మణెవ్వ మెడకు చున్నీ చుట్టి ఊపిరి ఆడకుండా చేసి తలపై బండరాయితో మోదాడు. అనంతరం ఒంటిపై ఉన్న బంగారు నగలతో పాటు మణెవ్వ ఫోన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం స్థానికులు మహిళ మృతదేహాన్ని గమనించి రామాయంపేట్‌ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గుర్తుతెలియని మహిళగా గుర్తించి కేసు నమోదు చేశారు. విచారణలో మృతిచెందిన మహిళను మణెవ్వగా గుర్తించి, నిందితుడు రవీందర్‌గా గుర్తించారు. ఈమేరకు రామాయంపేట్‌ పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు.